kalamdaily.com

# కలం


ప్రజల గళం...

మంగళవారం
24-03-2026 పేజీలు: 3

Follow on: Kalamtelugu

360° SINGLE TOPIC

హర్మూజ్




# హర్మూజ్‌కు నో ఆల్టర్నేట్

- క్రూడాయిల్ రవాణా నౌకలకు కీలకమైన రూట్
- ఇరాన్ వ్యూహంతో స్థంభించిన రాకపోకలు
- చాలా దేశాల్లో ఆయిల్, గ్యాస్ సంక్షోభం
- అందుకే ప్రాధేయపడుతున్న అమెరికా
- నాటో, యూరప్ దేశాలకు ట్రంప్ రిక్వెస్ట్

హర్మూజ్.. ఇప్పుడు ప్రపంచమంతా ఇదే హాట్ టాపిక్! గల్ఫ్ దేశాల నుంచి ముడిచమురు, గ్యాస్ దిగుమతికి ఇదొక్కటే రవాణా మార్గం. ఈ రూట్‌కు ఏ ఇబ్బంది కలిగినా ఆయా దేశాల నుంచి రవాణాకు బ్రేక్ పడుతుంది. దీంతో భారత్‌తో పాటు చాలా దేశాల్లో సంక్షోభం నెలకొంటుంది. అధిగమించాలంటే ఆల్టర్నేట్‌గా రష్యా, వెనిజువెలా లాంటి దేశాల నుంచి ముడిచమురు సమకూర్చుకోవాల్సిందే. సరిగ్గా ఈ కీలకమైన అంశాన్నే ఇరాన్ వాడుకుంటున్నది. ఈ జలసంధిలో రెండొంతుల భాగంపై ఆ దేశానిదే పెత్తనం. అందుకే నౌకల రాకపోకలపై ఆంక్షలు విధించింది. కువైట్, ఇరాక్, ఖతార్, సౌదీ, యూఏఈ దేశాల నుంచి ముడిచమురు రవాణాపై ఎఫెక్ట్ పడింది. అందుకే ఈ మార్గాన్ని తెరిపించేలా నాటో, యూరప్ దేశాలపై అమెరికా ఆధారపడుతున్నది. అయినా ఫలితం లేకపోవడంతో అమెరికా ఏకపక్షంగా, బేషరతుగా తాత్కాలిక సీజ్ ఫైర్ ప్రకటించింది. హర్మూజ్ జలసంధి, దానిపై ఎవరి పెత్తనమెంత? తదితరాలపై కలం 360 డిగ్రీస్ స్పెషల్ స్టోరీ....

– కలం, సెంట్రల్ డెస్క్

## స్ట్రాటజిక్ రూట్‌గా హర్మూజ్ జలసంధి

హర్మూజ్.. పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్‌ను కలిపే ఒక ఇరుకైన జలసంధి. ఈ మార్గంలో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద 50 కి.మీ. వెడల్పు ఉన్నా కీలకమైనచోట మాత్రం 33 కి.మీ. వెడల్పే. అయినా అంతర్జాతీయ ఇంధన సరఫరాకు ఇది 'లైఫ్ లైన్. దీనికి ఉత్తరాన ఇరాన్, దక్షిణాన యూఏఈ, ఒమన్ దేశాలు ఉన్నాయి. ఈ జలసంధి మిడిల్ పార్టులో మాత్రమే పెద్ద నౌకలు ప్రయాణానికి సరిపడినంత లోతు ఉంటుంది. ఇరాక్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, ఒమన్ తదితర దేశాల నుంచి ముడిచమురు, గ్యాస్, పెట్రో ఉత్పత్తులకు ఇదొక్కటే రవాణా మార్గం. మరో ఆల్టర్నేట్ లేదు. అందుకే దీన్ని స్ట్రాటజిక్ రూట్‌గా ఆ దేశాలు భావిస్తుంటాయి. సగటున రోజుకు 20 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు ఈ దేశాల నుంచి వివిధ దేశాలకు రవాణా అవుతూ ఉంటుంది. సంవత్సరానికి రూ. 50 లక్షల కోట్ల విలువైన ఆయిల్ బిజినెస్ జరుగుతుంది. తాజాగా అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు సంయుక్తంగా దాడులు జరపడంతో ఇరాన్ ఈ జలసంధిలో నౌకల రవాణా, రాకపోకలపై ఆంక్షలు విధించింది. చాలా దేశాల్లో ఆయిల్, గ్యాస్ సంక్షోభం అనివార్యమైంది.








## సౌదీకి మాత్రమే ప్రత్యామ్నాయ మార్గం




హర్మూజ్ జలసంధికి ఒకవైపు భూభాగం, మరోవైపు అరేబియా సముద్రం ఉంటుంది. భూభాగంవైపు ఇరాక్, కువైట్, ఖతర్, సౌదీ, యూఏఈ, ఒమన్ తదితర దేశాలుంటాయి. ఇక్కడ ఉత్పత్తి అయ్యే ముడిచమురు ఉత్పత్తులేవైనా ఈ జలసంధి మీదుగానే అరేబియా సముద్రంగుండా వెళ్లాలి. కానీ తాజా యుద్ధంతో హర్మూజ్ జలసంధిపై ఇరాన్ ఆంక్షలతో నౌకల రాకపోకలు నిలిచిపోయాయి. ఇలాంటి పరిస్థితి రావచ్చన్న ముందుచూపుతో సౌదీ అరేబియా ఆల్టర్నేట్ చర్యలు గతంలోనే చేపట్టింది. చమురు ఉత్పత్తులను రెడ్ సీ వైపు తరలించడానికి ఈస్ట్-వెస్ట్ పైప్‌లైన్ నిర్మించుకున్నది. అబుదాభి నుంచి ఒమన్ గల్ఫ్ లోని ఫుజైరా పోర్టు దాకా పైప్‌లైన్ వేసుకున్నది. దీంతో హర్మూజ్‌తో సంబంధం లేకుండానే చమురును ఎగుమతి చేసుకోవచ్చు. కానీ ఇరాక్, కువైట్, ఖతార్ వంటి దేశాలకు ఈ ప్రత్యామ్నాయాలు లేకపోవడంతో కచ్చితంగా హర్మూజ్ మీదుగా వెళ్లక తప్పదు.

## హర్మూజ్.. ట్రాన్సిట్ ప్యాసేజ్




ఐక్యరాజ్యసమితి సముద్ర చట్టం ప్రకారం.. హర్మూజ్ వంటి అంతర్జాతీయ జలసంధుల ద్వారా జరిగే ప్రయాణానికి స్పష్టమైన నిబంధనలున్నాయి. అందుకే ఇది ట్రాన్సిట్ ప్యాసేజ్. ప్రపంచంలోని ఏ దేశానికి చెందిన వాణిజ్య, యుద్ధ నౌకలైనా హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించవచ్చు. తీరాన్ని ఆనుకుని ఉన్న ఇరాన్, ఒమన్ ఇతర దేశాల నౌకలను ఆపడానికో, అడ్డుకోడానికో అధికారం లేదు. కానీ రెండొంతుల భూభాగం ఇరాన్‌ది కావడంతో భౌగోళిక సరిహద్దు అధికారంతో నౌకల రాకపోకలను నియంత్రిస్తున్నది. అనేక దేశాలు రిక్వెస్టు చేయడంతో ఇజ్రాయిల్, అమెరికాలకు సపోర్టు చేయని దేశాలకు ఆంక్షలను సడలించింది. ఆ కారణంగా ఆ దేశాలకు ముడిచమురు, గ్యాస్ రవాణా కొంతమేరకైనా సాధ్యమైంది. భారత్ వెళ్ళాల్సిన నౌకలకు అనుమతి ఈ రూపంలోనే లభించింది.


## ఇరాన్‌కు ఉన్న అధికారమేంటి?

ఇరాన్‌పై నేరుగా దాడులు జరిగినప్పుడు, ఆ దేశం తన రక్షణ కోసం కొన్ని ఆంక్షలు విధించే అవకాశం ఉంటుంది. అయితే, అంతర్జాతీయ వాణిజ్యాన్ని పూర్తిగా నిలిపివేసే చట్టబద్ధమైన అధికారం మాత్రం లేదు. దేశ భద్రతకు ముప్పు ఉందని భావించినప్పుడు జలసంధి గుండా వెళ్లే అనుమానిత వాణిజ్య నౌకలను ఆపి తనిఖీ చేసే అధికారం యుద్ధ సమయంలో మాత్రమే ఉంటుంది. భద్రతా కారణాల దృష్ట్యా ఓడలు వెళ్లే మార్గాలను మార్చాలని లేదా కొన్ని ప్రాంతాలను ప్రమాదకర ప్రాంతాలుగా ప్రకటించి ఎంట్రీని అడ్డుకోవచ్చు. ఇతర దేశాల యుద్ధ నౌకలు తన పరిధిలో ఉన్న జలాల మీదుగా వెళ్లకుండా అడ్డుకునే అధికారం కూడా ఉంది. అందువల్లనే అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధనౌకలు, ఆ దేశాల సైనికులు ఈ మార్గం గుండా వెళ్లకుండా ఇరాన్ తన అధికారాన్ని ప్రయోగించింది.



## ఐ.రా.స. సముద్ర చట్టం ఏం చెప్తున్నది?

ఐక్యరాజ్య సమితి 1982లో నిర్వహిసించిన 'కన్వెన్షన్ ఆన్ ది లా ఆఫ్ ది సీ' ప్రత్యేకంగా ఒక చట్టాన్ని రూపొందించింది. హర్మూజ్ వంటి అంతర్జాతీయ ప్రాముఖ్యత కలిగిన జలసంధుల గుండా వివిధ దేశాల వాణిజ్య, యుద్ధ నౌకలు అడ్డంకుల్లేకుండా ప్రయాణించేలా చర్చించి ఈ చట్టంలో నిర్దిష్టమైన నిబంధనలను పెట్టింది. ఇరాన్ ప్రభుత్వం సైతం ఈ చట్టంపై 1982లోనే సంతకం చేసింది. కానీ, అప్పటి నుంచి ఇరాన్ పార్లమెంట్ దీన్ని ఆమోదించలేదు. చట్టబద్ధంగా అమల్లోకి రావాలంటే సంతకమొక్కటే చాలదు. ఆ దేశ పార్లమెంటు ఆమోదం తప్పనిసరి. ఇరాన్ తన ప్రాదేశిక జలాల్లో ట్రాన్సిట్ ప్యాసేజ్‌కు బదులు 'ఇన్నోసెంట్ ప్యాసేజ్' నిబంధనను వర్తింపజేస్తుంది. అంటే, ఏదైనా నౌక తన భద్రతకు లేదా శాంతికి భంగం కలిగిస్తుందని భావిస్తే, దానిని అడ్డుకునే హక్కు తనకు ఉందని ఇరాన్ అంటుంది. ఐరాస సముద్ర చట్టంపై అమెరికా సంతకం చేయలేదు. అందుకే, 'చట్టంపై సంతకం చేయని అమెరికాకు, ఆ చట్టం ప్రకారం ప్రయాణించే హక్కు ఎక్కడిది?' అని ఇరాన్ ప్రశ్నిస్తుంది.




## ఎల్‌ఎన్జీ రవాణాకు కీలకం

ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే లిక్విడ్ నేచురల్ గ్యాస్ (ఎల్‌ఎన్జీ)లో దాదాపు 20% హర్మూజ్ జలసంధి గుండానే రవాణా అవుతుంది. ఇందులో ఎక్కువ భాగం ఖతార్ నుంచే వస్తుంది. ఖతార్ 2024లో రోజుకు సుమారు 9.3 బిలియన్ ఘనపుటడుగులు, యూఏఈ ఒక బిలియన్ ఘనపుటడుగుల ఎల్‌ఎన్జీని ఈ మార్గం ద్వారానే ఎగుమతి చేశాయి. మిడిల్ ఈస్ట్ నుంచి ఎగుమతి అయ్యే ఎరువులకు కూడా హర్మూజ్ జలసంధి కీలకమైన మార్గం. ఎరువుల ఉత్పత్తి ప్రక్రియలో నేచురల్ గ్యాస్ వినియోగం ఎక్కువ. ప్రపంచవ్యాప్తంగా జరిగే ఎరువుల వ్యాపారంలో సుమారు మూడో వంతు ఈ జలసంధి ద్వారానే సాగుతుంది. ఆహార పదార్థాలు, మందులు, ఎలక్ట్రిక్ పరికరాలు వంటివి ఈ జలసంధి ద్వారానే గల్ఫ్ దేశాలకు వెళ్తాయి. గల్ఫ్ దేశాలతో ఇతర దేశాల అన్ని రకాల వ్యాపార లావాదేవీలు, ఎగుమతి-దిగుమతి బిజినెస్‌కు హర్మూజ్ జలసంధి కీలకమైన రూట్.





## నెలకు 3 వేల నౌకల రాకపోకలు

నెలకు సగటున 3,000 నౌకలు హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తుంటాయి. రోజుకు యావరేజ్‌గా 100 నుంచి 110 నౌకలు తిరుగుతుంటాయి. ట్యాంకర్లు, నౌకలపై దాడులు చేస్తామంటూ ఇరాన్ స్పష్టమైన హెచ్చరికలు చేసింది. దీంతో ఈ రూట్‌లో నౌకల రాకపోకలు బాగా తగ్గాయి. ఇరాన్‌పై యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి 21 నౌకలపై ఇరాన్ దాడులు చేసింది. ఇందులో వివిధ దేశాలకు చెందిన 18 వాణిజ్య నౌకలున్నాయి. క్షిపణులు, డ్రోన్ బోట్లు, సముద్రపు మైన్ల ద్వారా అటాక్ జరిగింది. అందుకే ఇన్సూరెన్స్ కంపెనీలు ఈ మార్గంలో ప్రయాణించే నౌకలకు కవరేజ్ ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయి. ఇరాన్‌తో పాటు గల్ఫ్ దేశాలు తమ ఆదాయం కోసం ప్రధానంగా ఇంధన ఎగుమతులపైనే ఆధారపడతాయి. కానీ సరుకు రవాణా తగ్గిపోవడంతో ఆయిల్, గ్యాస్ క్రైసిస్ తలెత్తింది.


## ఇరాన్ స్ట్రాటజీతో అమెరికా ఉక్కిరిబిక్కిరి



గల్ఫ్ దేశాల ఎగుమతి, దిగుమతులకు హర్మూజ్ జలసంధి రూట్ కీలకం కావడంతో ఇరాన్ దీన్ని అస్త్రంగా మార్చుకున్నది. హర్మూజ్ మీదుగా వెళ్తున్న నౌకలపై ఆంక్షలు విధించింది. కొన్ని రోజుల పాటు పూర్తిగా నిషేధం విధించింది. యూరప్ దేశాలపైనా వేర్వేరు రూపాల్లో ప్రభావం పడడంతో ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికాపై ఒత్తిడి పెరిగింది. ఆయా దేశాలు ఈ మూడు దేశాలకూ అప్పీల్ చేశాయి. టెక్నాలజీ, మిసైళ్లు, ఆయుధాలతో ఇజ్రాయిల్, అమెరికా దాడులు చేస్తూ ఉంటే ఇరాన్ మాత్రం వాటికి అదనంగా టెర్రయిన్‌ను కూడా వ్యూహంగా ఎంచుకున్నది. అమెరికాను లొంగదీసుకోడానికి హర్మూజ్ కీలకమవుతుందని భావించిన ఇరాన్ నిషేధాజ్ఞలు విధించి ఉక్కిరిబిక్కిరి చేసింది. మూడు వారాల యుద్ధం తర్వాత అమెరికా తాత్కాలికంగా సీజ్ ఫైర్ ప్రకటించక తప్పలేదు.

## హర్మూజ్ లేకుంటే దూరాభారం, ఖర్చు

భారతదేశం తన ముడిచమురు అవసరాల్లో దాదాపు 60% హర్మూజ్ మార్గంపైనే ఆధారపడుతున్నది. గల్ఫ్ దేశాల నుంచి ఆయిల్ రావాలంటే ఈ మార్గమొక్కటే శరణ్యం. మరో ప్రత్యామ్నాయం లేదు. హర్మూజ్ నుంచి ఆయిల్ నౌకలు అరేబియా సముద్రం మీదుగా ముంబై, జామ్‌నగర్ రేవులకు చేరుకుంటాయి. సుమారు 2,700 కి.మీ. ప్రయాణించడానికి నాలుగైదు రోజులు పడుతుంది. హర్మూజ్ పూర్తిగా మూతబడితే గల్ఫ్ దేశాల నుంచి చమురు దిగుమతి కంప్లీట్‌గా ఆగిపోతుంది. ఆఫ్రికా, రష్యా, వెనిజువెలా లాంటి ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సి ఉంటుంది. కేప్ ఆఫ్ గుడ్ హోప్ మార్గంలో ఆఫ్రికా ఖండాన్ని చుట్టి రావాల్సి ఉంటుంది. సుమారు 22 వేల కి.మీ. దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. నెల రోజుల టైమ్ పడుతుంది. ఖర్చు ఆరేటు రెట్లు పెరుగుతుంది. పెట్రోల్, డీజిల్ ధరలూ పెరిగిపోతాయి.




## హర్మూజ్‌లో 22 కి.మీ. ఇరాన్ దేశానిదే

హర్మూజ్ జలసంధికి ఒకవైపు ఇరాన్ మరోవైపు ఒమన్ ఉంటాయి. మొత్తం 33 కి.మీ. వెడల్పులో 22 కి.మి. ఇరాన్‌దే. అంతర్జాతీయ చట్టాల ప్రకారం తీరం నుంచి 22 కి.మీ. వరకు ఉన్న సముద్రాన్ని ఆయా దేశాల ప్రాదేశిక జలాలుగా ఉంటాయి. హర్మూజ్ జల సంధి వెడల్పు తక్కువ కావడంతో నౌకలు ప్రయాణాలకు ఇరాన్, ఒమన్ అనుమతి ఇవ్వాలి. ఐరాస చట్టం ప్రకారం ట్రాన్సిట్ ప్యాసేజ్ పర్మిషన్ ఇస్తాయి. ఐరాస చట్టంపై సంతకమే చేయని అమెరికా ఆంక్షలు విధించడంతో గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగాయనే పేరుతో ఇరాన్ నేవీ ఆ 22 కి.మీ. తీర ప్రాంతాన్ని అదుపులోకి తీసుకున్నది. అమెరికా, పశ్చిమ దేశాల నౌకాదళాలు హర్మూజ్‌లో పహారా కాస్తున్నా భౌగోళికంగా ఇరాన్‌కు ఉన్న అడ్వాంటేజ్‌తో నౌకల రాకపోకలపై ఆంక్షలు తప్పలేదు.

## మిత్ర దేశాల నౌకలకే క్లియరెన్స్

హర్మూజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలకు మిత్ర దేశాలకు మాత్రమే అనుమతి ఇచ్చింది. ఇజ్రాయిల్, అమెరికా దేశాలకు సహకరించని దేశాలకే క్లియరెన్స్ ఇచ్చింది. అమెరికా, ఇజ్రాయెల్‌కు సహకరించే దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులు చేసింది. ఆయిల్ రవాణా చేసే నౌకలను అడ్డుకుంటున్నది. కేవలం 33 కి.మీ. వెడల్పే ఉన్న హర్మూజ్ జలసంధిని ఇరాన్ తన గుప్పిట్లో పెట్టుకొని ప్రపంచాన్ని వణికిస్తున్నది. అనేక దేశాలు ప్రాధేయ పడుతున్నాయి. చివరకు అమెరికా సైతం మెట్టు దిగక తప్పలేదు. అమెరికా తాత్కాలిక సీజ్ ఫైర్ ప్రకటించినా ఆ తర్వాత ఎలాంటి వైఖరి తీసుకుంటుందోననే చర్చ లేకపోలేదు. ఇరాన్ ఈ సీజ్‌ఫైర్‌ను వాడుకుని ఎలాంటి వ్యూహం అనుసరిస్తుంది.. అమెరికా-ఇజ్రాయిల్ ఈ ఐదు రోజుల కాలాన్ని ఎలా వాడుకుంటాయి.. ఇవన్నీ రకరకాల చర్చలకు దారితీశాయి.

